కథ

# చంద్రోదయం



ఇమంది రామారావు

*ప్రకృతి తన అందాలన్నీ అక్కడే ఆరబోసుకుంటున్నట్లుంటుంది భీమ్లీ బీచ్. ముఖ్యంగా వేసవిరోజులొస్తే సందడే సందడి. చిన్నాపెద్దా అంతా అక్కడే తిష్ఠవేసుక్కూర్చుంటారు.*

*నేనెప్పుడూ కూర్చునే ఓ చోటుంది.*

*సరకు తోపు దగ్గర్లో ఓ అందమైన బండరాయి. అక్కడ కూర్చుంటే ఉవ్వెత్తున ఎగిసిపడే కెరటాలు కనువిందు చేస్తుంటాయి. ఒక్కోసారి కెరటాల పోటు ఎక్కువైనప్పుడు నేను కూర్చున్న బండకి తగిలి చల్లగా స్పర్శించి చక్కిలిగింతలు పెడతాయి. ఎంత హాయిగా వుంటుందని?*

నాకెందుకో సముద్రమంటే చాలా ఇష్టం. సముద్రాన్ని చూసి మనిషి చాలా నేర్చుకోవచ్చునిపిస్తుంది. విరిగిపడే కెరటాల నురుగలు చూసినప్పుడు కేరింతలు కొట్టే పసిపాప నవ్వులు గుర్తొస్తాయి.

ఉవ్వెత్తున ఎగసిపడే కెరటాల్ని చూసినపుడు... వయసు బింకంలో పరాకాష్టకు చేరుకున్న ఉద్రేకం గుర్తొస్తుంది. అలసటా ఆటవిడుపూ ఎరగని కెరటాలు నలగి కలగిపోతున్నప్పుడు... ఆశనిరాశల మధ్య నలగిపోతున్న నడివయసు గుర్తొస్తుంది. మౌనంగా, గంభీరంగా, స్తబ్ధతగా వున్నపుడు అనుభవాన్ని పండించుకొని అన్నిటికీ అతీతంగా వున్న వృద్ధాప్యం గుర్తొస్తుంది. ఇంకా సముద్రం ఎంత గొప్పది? తన గుండెలోతుల్లో ఎన్ని అగ్నిపర్వతాలు... ఎన్నెన్ని అద్భుతాలు దాచుకుంది.

"ఎక్స్‌క్యూజ్ మీ!" సన్నగా వినిపించిందో గొంతు. తిరిగి చూశాను.

చంద్ర.

నా క్లాస్‌మేట్ చంద్రకాంతి.

కాకినాడలో డిగ్రీ నాతోనే చేసింది. మరిక్కడేం పని? ఏవేవో ఆలోచనలు ముసురుకున్నాయి. ఆనందం. ఆశ్చర్యం రెండూ ఒకేసారి నాలో చోటుచేసుకున్నాయి.

"మీరు... మీరిక్కడికెలా వచ్చారు?" ఎగ్జయిట్‌మెంట్‌ని ఆపుకోలేక అడిగేశాను.

"వెహికల్లో రాలేదు. నడిచేవచ్చాను!" సన్నగా నవ్వుతూ అంది. చంద్ర నవ్వు చాలా అందంగా వుంటుంది. వెన్నెలంత హాయిగా వుంటుంది. కాలేజీలో చదువుతున్న రోజుల్లో నా ఫ్రంట్ బెంచ్‌లో కూర్చొనేది. లెక్చరర్స్‌ని స్టూడెంట్స్ ఏడిపిస్తున్నపుడు పక్కకి తిరిగి పగలబడినవ్వేది. అలా నవ్వుతుంటే ఎంతసేపైనా చూడాలనిపించేది. చెంపకు చేరడేసి కళ్ళు ఆమెకు దేవుడిచ్చిన వరం. సంపెంగలాంటి ముక్కు... ఆ ముక్కు పుటల మీద తేలిపోయే నవ్వు... అందాన్ని వెయ్యింతలు చేసే అందమైన నవ్వు మళ్ళీ ఎంతకాలానికి చూడగలిగేను. నా అదృష్టానికి నేనే మురిసిపోయాను.

"ఏవిటీ... మీరలా చీటికీ మాటికీ ఫ్రీజ్ అయిపోతున్నారు? ఇంకా కవిత్వం పిచ్చి పోలేదా?" అంది చనువు తీసుకొంటూ.

షాక్ తిన్నాను. అసలు తనెప్పుడూ అంత చనువుగా మాట్లాడదు. కొత్తగా వుందామె ప్రవర్తన.

'మీతోబాటూ...' అన్నాను బండమీద నుంచి కిందకి జంప్‌చేసి చేతులకు అంటుకున్న ఇసుకను దులుపుకొంటూ.

"మీరున్నారుగా!" అంది మళ్ళీ కిసుక్కున నవ్వి.

"నేను సీరియస్‌గా అడుగుతున్నాను చెప్పండి కాకినాడ నుండి ఎప్పుడు వచ్చేరు? ఇక్కడెంత కాలం వుంటారు? ప్రస్తుతం వ్యాపకం ఏవిటి?" ఇలా అడగాలనుకుంటున్న ప్రశ్నల్ని గబగబా అడిగేశాను.

"మీరిలా గుక్క తిప్పుకోకుండా ప్రశ్నలడిగేస్తే ఆ ప్రశ్నలకు సమాధానం నేను చెప్పద్దూ. కాకినాడ నుండి ఈమధ్యనే వచ్చాను. ఇక్కడే వుంటాను. ఇక వ్యాపకం అంటారా? మీరున్నారుగా... ఏదైనా మంచి వ్యాపకం కల్పించండి!" అంది ముక్కు చిట్లించి కవ్వింతగా నవ్వుతూ.

నాకు పిచ్చెక్కిపోయింది.

భగవంతుడు చాలా పక్షపాతి. ఒక్కోసారి అందమంతా ఒక్కచోటనే పొందుపరుస్తాడు. చూపరుల కళ్ళు చెదరగొడతాడు. అందని అందం కోసం అర్రులు చాస్తూ... అలమటించిపోతుంటే అది చూసి ఆనందిస్తుంటాడు.

"సరే... మీ గురించి వివరాలు చెప్పేరు కాదు. చెప్పండి. మీరేం చేస్తున్నారు? పెళ్ళైందా? అఫ్‌కోర్స్ పిల్లలింకా పుట్టకపోయుండొచ్చు. ఏమై కరెక్ట్?" అడిగింది చురుగ్గా చూస్తే.

"సెంటిపర్సంట్. నాకింకాపెళ్ళికాలేదు. వుద్యోగం వొస్తేగాని పెళ్ళికాదు. పెళ్ళైతే ఉద్యోగం మీద ఇంట్రెస్టు తగ్గుతుంది. ప్రస్తుతానికి ఈ ప్రకృతే నాకు పాఠ్యగ్రంథం. ఇంగ్లీషులో 'ఎవ్విర్ డాగ్ హాజె డే' అంటారు కదా. కుక్కలకే ఒకరోజంటూ వచ్చేటపుడు మనుషులకి రాకుండా పోతుందా! వస్తుంది. అందాకా వెయిట్ అండ్ సీ!" అన్నాను జోక్ కట్ చేసినట్లు ఫీలయ్యి.

"కరెక్టే. ఎవ్విర్ డాగ్ హాజె డే" అంది రిపీట్ చేసి ఫక్కున నవ్వేస్తూ.

"మీరు మునుపటికంటే చాలా స్మార్ట్‌గా చాలా యాక్టివ్‌గా వున్నారు. ట్రెమండస్ ఛేంజ్... ఇంతకీ మీ వివరాలు చెప్పలేదు" అన్నాను కుతూహలంగా.

"ఇంటికి పదండి? తీరిగ్గా మాట్లాడుకుందాం!" అంది సడన్‌గా. నేను మంత్రముగ్ధుడిలా ఫాలో అయ్యాను.

సముద్రతీరంలోనే పాతకాలంనాటి భవనం. చాలా అందంగావుంది. ఇంటి పేరు నన్ను మరీ ఆకర్షించింది. 'చంద్రోదయం'. ఎంత చక్కని పేరు.

"మీ టేస్ట్ చాలా డిఫరెంట్‌గావుంది" అన్నాను లాన్‌లో ఎరేంజ్ చేయబడిన కుర్చీలో కూర్చొంటూ.

"డిఫరెంట్‌గా వుంటేనే అది టేస్ట్ అవుతుంది. లేకపోతే వేస్టవుతుంది!"అంది మళ్ళీ నవ్వి.

"ఇంకేం కవిత్వం మీకూ అబ్బింది. విశాఖపట్నం ఆకాశవాణి కేంద్రానికి ఏదైనా సంగీత రూపకం రాసిపెట్టకూడదూ?" అన్నాను.

"యహ్హా... హుజూర్. తప్పకుండా ప్రయత్నం చేస్తా! ఆలిండియా రేడియో శ్రోతల్ని ఆ భగవంతుడు పదికాలాలు చల్లగా కాపాడుగాక!" అంది యాక్షన్ చేసి చూపిస్తూ. కళ్ళల్లో ఓ వినూత్నమైన మెరుపు... అలా చూస్తూ వుండిపోయాను.

"తీరిగ్గా నన్ను చూడొచ్చుగాని నైట్‌కి ఏంచేస్తారు? టిఫినా? భోజనమా? ఈ రోజు మీరు ఇక్కడే వుంటున్నారు!" అంది స్థిర సంకల్పంతో.

"అదేవిటి? దబాయిస్తున్నారా?"

"అలాంటిదే!"

"ఇంట్లో చెప్పి రావాలిగా!"

"పెళ్ళాం పిల్లల్లేరుగా. మా ఫ్రండింట్లో వుంటున్నానని ఓ ఫోన్ చేసి చెప్పండి!"

"ఫరవాలేదులెండి. నాటకాల రిహార్సల్స్ వేస్తూ ఎన్ని రాత్రులు ఇంటికెళ్ళకుండా మానెయ్యలేదు! మావాళ్ళేం అనుకోరుగాని ఏవిటి విశేషం?"

"ఈరోజు పౌర్ణమి కదూ?"

అప్పుడు నాకు లైట్ వెలిగింది. ఆకాశంలో మూన్‌లైట్ వెలుగుతోంది.

"అవును పౌర్ణమే. నిండు పౌర్ణమి" అన్నాను అప్రయత్నంగా.

ఇంతలో వంటమనిషి వచ్చింది. ఆమె చెవిలో ఏవో గుసగుసలాడింది. ఆమె వెళ్ళిపోయింది.

"పావుగంటలో భోంచేసేయొచ్చు. ఏవైనా మంచి కబుర్లు చెప్పండి!" అంది కుర్చీ ముందుకు జరుపుకుంటూ.

చల్లని సముద్రపు గాలికి ఆమె ముంగురులు అందంగా ముఖంమీద పడి మరింత అందంగా కనిపిస్తున్నాయి. సుతారంగా ముంగురుల్ని సవరించుకొంటూ సన్నగా నవ్వింది.

"మీరు చాలాకాలం తర్వాత కనిపించారు. మన స్నేహం మరిచిపోకుండా డిన్నరిస్తున్నారు. చాలా హాపీగా వుంది. మీరు మనసు పరిచి మాట్లాడితే ఇంకా హాపీగా ఫీలవుతాను" అన్నాను. చంద్ర సున్నితంగా నవ్వింది. ఆ నవ్వులో సమ్మోహన చంద్రకాంతి స్పష్టంగా కనిపిస్తూంది.

"రాజూ... మీలాగే నాకూ సముద్ర తీరంలో సముద్రాన్ని చూస్తూ గడపడం అంటే చాలా ఇష్టం!" అంది.

"లైక్ మైండెడ్ అంటే అదే మరి!"

"అవునూ డిగ్రీ ఫినిషయ్యి మూడేళ్ళ

వుతున్నా ఇంకా పెళ్ళి చేసుకోలేదేం?" ఆసక్తిగా అడిగింది. నిజానికి ఆ ప్రశ్నకి సమాధానం నాదగ్గర లేదు. అయినా చంద్ర మనసు తెలుసుకోవాలనిపించింది. ఈ లోగా ఫలహారాలొచ్చాయి. కానిచ్చేశాం.

"థాంక్స్‌లూ... సారీలూ లేకుండా నేనడిగిందానికి సూటిగా సమాధానం చెప్పండి!" అంది తనే విషయాన్ని మళ్ళీ కదుపుతూ.

"అసలు పెళ్ళిక్కావలసిన క్వాలిఫికేషన్లేంటి?"

"ఏముంది. మంచివుద్యోగం, సద్యోగం!"

"అచ్చు అమ్మమ్మలా మాట్లాడేవు చంద్రా!"

"లేకపోతే రెండు తలకాయలూ నాలుగు చేతులూ కావాలా?"

"అందం చందం చదువూ సంస్కారం ఇవ్వేవీ అఖ్ఖర్లేదా?"

"పిచ్చిరాజూ... ఇవన్నీ వుంటేనే మిగతా రెండింటిని గురించి ఆలోచిస్తారెవరైనా?" అంది స్థిరమైన గొంతుతో మామధ్య మునుపటి చనువు చోటుచేసుకుంది. చాలా సీరియస్‌గా వాదించుకొనేవాళ్ళం. ఒక్కోసారి మాటామాటా పెరిగి ముఖం కందగడ్డల్లా పెట్టుకొని గుడ్‌నైట్ చెప్పుకొనేవాళ్ళం. మళ్ళీ అరగంట తర్వాత మామూలే. చంద్రాకి ఫోన్ చెయ్యాలి. చంద్రాకి గుడ్‌మార్నింగ్ చెప్పాలి. చంద్రాని గురించి ఆలోచిస్తే అదో హాయి. అనూహ్యమయిన ఆనందం అందులోనే వుంది. అన్నిటి కంటే ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే చంద్ర ఏరోజూ దగ్గర చేయలేదు. అలా గని దూరంగానూ వుంచలేదు.

"నువ్వు మధ్యమధ్యలో ఇలా ఫ్రీజయిపోయి... ఫ్లాష్‌బ్యాక్‌కి వెళ్ళిపోతే భరించడం కష్టం. ఎంచక్కా కబుర్లు చెప్పు!" అంది. మీరులోంచి నువ్వులోకి జంప్ చేసింది. నిజానికి అలా పిలిస్తేనే నేచురల్‌గా వుంది. మీరు- మీరు అనుకునేటంత దూరంకాదు మేము.

"ఊ... చెప్పు రాజూ... ఈ వెన్నెల రాత్రి వృథా చెయ్యకు?" అంది ముద్దుగా.

"ఏం చెప్పను చంద్రా. జీవితం యాంత్రికంగా సాగిపోతుందని చెప్పనా? నేను ప్రేమించేవాళ్ళు నన్ను ప్రేమించడంలేదని చెప్పనా? అసలు నా జీవితంలో ప్రేమకి చోటులేదని చెప్పనా?" అన్నాను అప్రయత్నంగా.

"నువ్వు. నువ్వెవరినైనా ప్రేమించావా?" కళ్ళు పెద్దవి చేస్తూ అడిగింది. ఆ ప్రశ్నకి సమాధానం చెప్తే నుయ్యి చెప్పకపోతే గొయ్యి. గతంలో ఒకటి రెండుసార్లు గ్రీటింగ్స్ నా కవిత్వం పైత్యం అంతా ఒలకబోశాను. నవ్వుకుంది. పరవాలేదు కవితలు బాగానే రాస్తారని సర్టిఫికేట్ ఇచ్చింది. అంతకంటే ఒక్కడుగు ముందుకెళితే సెవెన్‌ఓక్లాక్ బ్లేడుతో చర్మం వొలిచేస్తుంది.

"సరే... నేనో అబ్బాయిని ప్రేమించాను" అంది ఠక్కున. షాక్ తగిలినట్లనిపించింది.

"ఎవరూ?"

"రవిని... వైజాగ్‌లో వుంటున్నాడు. షిప్‌యార్డ్‌లో ఆఫీసరు!"

"ఐ...సీ!"

"ఐసీ అంటారేంటీ. మీరింకా ఆయన్ని చూడలేదు. ఇదిగో ఈ ఫోటో చూడండి!" వ్యానిటీ బ్యాగ్‌లోంచి కవరుతీసి అందించింది. అందులో ఫోటో సో...సో...గా వుంది. జిహ్వాకో రుచి పుర్రెకో బుద్ధి అంటారు ఇదేనేమో. నా గుండె వేగం ఎక్కువైంది. వెన్నెల వేడెక్కిపోతున్నట్లనిపించింది. చల్లగాలి వీస్తున్నా చెమట్లు పడతన్నై.

"రాజూ ఏమయ్యింది నీకూ. ఫోటో ఎలావుంది?"

"బావుంది. గుడ్ లుకింగ్!"

"నా సెలక్షన్ బావుందా?"

"ఓహ్. ఎక్స్‌లెంట్. బెస్టాఫ్‌లక్"

"నేను ప్రేమించాను. సరే... అతగాడు నన్ను ప్రేమించఖ్ఖర్లేదూ?"

"అదేంటీ?" ఆయన ప్రేమించకుండానే...

"అదంతే! రవి అందంగా మాట్లాడతాడు. మనసు తెలుసుకొని ప్రవర్తిస్తాడు. ముఖ్యంగా రవి నాదగ్గరుంటే నాకీ ప్రపంచమే తెలీదు. స్వర్గలోకాలెలా వుంటాయో నాకు తెలీవుగాని... రవి సాంగత్యంలా వుంటాయని చెప్పగలను. రవి మాటల్లా వుంటాయని చెప్పగలను. రవి అందంలా వుంటాయని చెప్పగలను. రవి నన్ను ప్రాణంగా ప్రేమిస్తున్నాడు. నా కంఠంలో వూపిరున్నంతవరకూ ప్రేమిస్తానంటున్నాడు!"

"ఇంకేం... లైనీజ్ క్లియర్. మరతగాడు ప్రేమించఖ్ఖర్లేదూ అంటారేంటీ?"అన్నాను.

"అదిగో... నీకు ఆవేశం ఎక్కువ. ఆలోచన తక్కువ. చెప్పింది వినవేం? నేను రవిని పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాను. ఏవంటావ్?" అంది సడన్‌గా.

"శుభం. ఆల్‌ద బెస్ట్!" అన్నాను.

"రవిని చేసుకుంటున్నానంటే నీకెందుకూ కుళ్ళు?" సూటిగా నా కళ్ళల్లోకి చూస్తూ అడిగింది.

"సరే... ఏమయినా మంచి కబుర్లు చెప్పండి" అన్నాను టాపిక్ మారుస్తూ.

"వాట్‌డుయూ మీన్. నా పెళ్ళి గురించి మాట్లాడ్డం నీకు మంచిగా అనిపించడం లేదూ?" విస్మయంగా అడిగింది.

"సరే... మీ పెళ్ళి... మీ ప్రేమ... మీ ఇష్టం. ఆల్రెడీ ఓ కన్‌ఫర్మేషన్‌కొచ్చేశారు. నన్నెందుకు ఇరకాటంలో పెడతారు?" అన్నాను. ఎంత దాచుకుందామన్న నా ముఖంలో ఏదో చికాకు కొట్టొచ్చేలా కనిపిస్తుంది. అది గమనిస్తూనే వుంది చంద్ర.

"మేడమీదకెళ్లి మాట్లాడుకుందామా?" అంది టాపిక్ మార్చి...లొకేషన్ మార్చడానికి ఉపక్రమిస్తూ... నేను అనుసరించాను. మేడమీద అందంగా తీర్చిదిద్దబడిన రూఫ్ గార్డెనుంది. మల్లెల గుబాళింపు అదోలాంటి గమ్మత్తైన సువాసనలు వెదజల్లుతూ మత్తెక్కిస్తున్నాయి.

"మీ పేరెంట్సేమంటారు?" నేనే మళ్ళీ టాపిక్ కదిపేను. చంద్ర సన్నగా నవ్వింది. 'అదిగో... మరదే క్యూరియాసిటీ అంటే... మా పేరెంట్స్ దుబాయ్‌లో వున్నారు. నా పెళ్ళి నా ఇష్టం. వాళ్ళడ్డు చెప్పరు. ఇండియా వచ్చినపుడు నాలుగక్షింతలు వేస్తారు. అఫ్‌కోర్స్ మా పేరెంట్స్‌కీ టాపిక్ తెలుసు... కానీ తెలీంది ఒ...క్క...టే!" అంది భారంగా నిట్టూరుస్తూ.

"ఏవిటది?" ఆమె మాటల్లో ఏదో అపశృతి నన్ను కలవరపరిచింది.

"అదే... చెప్పేనుగా. రవి నన్ను పెళ్ళి చేసుకుంటాడో... చేసుకోడో..."

"మీకా అనుమానం ఎందుకొచ్చింది?"

"కీడెంచి మేలెంచడంలో తప్పులేదుగా!"

"మరీ ఇంత కీడెంచడం ఏంబాలేదు!"

"సరే... నీకో నిజం చెప్తాను. షాక్ తినకూ" అంది.

నాకు టెన్షను ప్రారంభమైంది. 'చెప్పండి' అన్నాను అప్రయత్నంగా.

"నాకు భయంకరమైన కేన్సరు. కాకిలా కడవరకూ బతికే బదులు హంసలా ఆరు మాసాలు బతకమని ఆ బ్రహ్మదేవుడు రాసిచ్చాడు. నాకు చావంటే భయంలేదు. బట్ రవి జీర్ణించుకోగలడా? జీర్ణించుకున్నా పెళ్ళి చేసుకోగలడా? అలా పెళ్ళి చేసుకోమని ప్రాధేయపడటం కూడా స్వార్థంకాదూ? అఫ్‌కోర్స్ మానవజీవితమే స్వార్థంతో ముడిపడివుంది. నాకు మెళ్ళో తాళిబొట్టూ... కళ్ళకు కాటుకా... నుదుట కుంకుమ... హాయిగా నా భర్త ఒళ్ళో కళ్ళు మూయాలన్న స్వార్థం. ఈ కోరిక తీరుతుందంటావా?" బేలగా అడిగింది చంద్ర.

నాకు భయంకరమైన కేన్సరు. కాకిలా కడవరకూ బతికే బదులు హంసలా ఆరు మాసాలు బతకమని ఆ బ్రహ్మదేవుడు రాసిచ్చాడు. నాకు చావంటే భయంలేదు. బట్ రవి జీర్ణించుకోగలడా? జీర్ణించుకున్నా పెళ్ళి చేసుకోగలడా?

గుండె బరువెక్కిపోయింది. నోటమాట పెకలడంలేదు. అప్రయత్నంగా కన్నీళ్ళు చిప్పిల్లాయి.

"మాట్లాడవేం రాజూ... మనసు పరిచి మాట్లాడుకుందామని ముందే కండిషను పెట్టి సైలెంటయిపోయావేం? నేను తప్పుగా ఆలోచిస్తున్నానా?" అంది. చంద్ర కళ్ళు శ్రావణమేఘాలయ్యాయి. ఇంతలో రవి దగ్గర్నుంచి ఫోను.

చటుక్కున ఫోను తీసింది. 'హలో...' అంటూ చాలా తీయగా పలకరించింది. అంతవరకు మబ్బులు కమ్ముకున్న చందమామ... ఆ మబ్బుల్ని దూరంగా తరిమేసి 'వెన్నెల దీపం'లా వెలిగిపోతున్నట్లనిపించింది.

అవతలి గొంతు స్పష్టంగా వినిపించింది.

'ఇంకా నిద్రపోలేదా?'

'అప్పుడే నిద్రా...'

'ఏం చేస్తున్నారు?'

'మీ ఫోన్ కోసం ఎదురుచూస్తున్నా'

'మీ పేరెంట్స్ దగ్గర్నించిఫోనొచ్చిందా?'

'నిన్నే మాట్లాడేను'

'అంతా హేపీనా!'

'హేపీయే. మీరెప్పుడొస్తున్నారు?' ఆశగా అడిగింది.

'నేనెందుకూ... ఇక్కడేవో పనులున్నై. మీరే రావచ్చుగా"

"నేనా. ఎందుకో ప్రయాణమంటే బోరు కొడుతుంది!"

"ఇంట్లోవున్నా బోరు కొడుతుందిగాని నా మాటవిని రేపు బయలుదేరి రండి. ఒకరోజుండి వెళ్ళిపోదురుగాని" తర్వాత ఫోను పెట్టేసిన చప్పుడు వినిపించింది. చంద్ర రిలాక్సయ్యింది. మునుపటి అలసట కనిపించలేదు. బాధ కనిపించలేదు.

"నీకు బోరుకొట్టిందా?"అంది గోముగా.

"బోరెందుకూ... మీరు హ్యాపీగా వుంటే నేనూ హాపీనే"

క్షణం మా ఇద్దరి మధ్యా మౌనం.

"రాజూ... నేనోమాట చెప్తాను. డోంట్ మిస్టేకెన్‌మీ. ఆడవారి మనసు చాలా విచిత్రమైంది. తను ప్రేమించేవారిని గౌరవిస్తుంది ఇష్టపడదు. తనను శాసించేవారిని ప్రేమిస్తుంది. రవి నన్ను కమేండ్ చేస్తాడు డిమాండ్ చేస్తాడు. నేను నాదైన ప్రతి వస్తువూ తన సొంతం అనుకుంటాడు. రవి మాటల్లో ఏదో మత్తువుంది. రవిని నేను కోరుకోవడం తప్పంటావా? అఫ్‌కోర్స్- నేనిష్ట పడితే బ్రహ్మదేవుడు దిగొచ్చి చెప్పినా విన్ననుకో!" అంది కన్‌ఫర్మ్‌డ్‌గా.

"గాడ్ బ్లెస్ యూ!" అన్నాను.

"నీకు ఒళ్ళుమండింది కదూ..."

"కాదు... వెన్నెల మండుతోంది" అన్నాను. నాకు ముందరి కాళ్ళబంధం వేసింది. నా మనసులోని మాట చెప్పడానికి అవకాశం లేకుండా చేసింది. నన్ను కట్టి పడేసింది. విధి చాలా చిత్రమైంది. ఎప్పుడో కలుసుకున్నాం. ఒకటిగా వున్నాం. మళ్ళీ విడిపోయాం... ఇపుడిలా కలవడమేంటీ! నన్నింత అభిమానించడమేంటీ... మరొకర్నింత ఆరాధించడమేంటీ...అన్నిటినీ మించి ఆ భయంకరమైన చేదు నిజం మింగుడుపడటంలేదు.

'రాజూ! నేను రేపు రవిని కలుస్తాను. నిజం చెప్తాను. చెప్పమంటావా?" అంది.

"చెప్పండి. తప్పేముంది"

"ఇదిగో ఈ అండీలూ గిండీలు అంటే ఒళ్ళు మంట. ఇంతవరకూ ఎంచక్కా మాట్లాడేవుగా. ఏమయ్యింది నీకు?"

"ఓ.కె.గో ఎ హెడ్!" అన్నాను. చంద్ర గుడ్‌నైట్ చెప్పి తన బెడ్‌రూమ్‌కి వెళ్ళిపోయింది. నేను గెస్ట్‌రూమ్‌లో నిద్రపోయాను. కాదు నిద్ర నటించాను. ముసురుకున్న ఆలోచనలు... నిలకడగా వుండనివ్వలేదు.

** ** **

"రాజూ... నిన్నింత సడన్‌గా ఎందుకు పిలిపించానో తెలుసా? అంది చంద్ర.

"ముందు మీ ప్రపోజల్ ఏవయ్యింది. అది చెప్పండి" అన్నాను. చంద్ర తన పక్కన కూర్చున్న వ్యక్తిని పరిచయం చేసింది. తనకు బాగా కావలసినవాళ్ళు. బ్రదర్‌లాంటివాడని... నమస్కారం పెట్టాడు. నేను ప్రతి నమస్కారం చేశాను.

"రాజూ హాస్పిటల్‌లో మరోసారి చెకప్ చేశారు?"

"ఏవన్నారు?" నాకు తెలియకుండానే క్యూరియాసిటీగా అడిగాను. చంద్ర కిసుక్కున నవ్వింది. 'ముచ్చటగా మూడు మాసాలుండి పోతావ్' అన్నారు అంది. ఆ మాటలంటుండగానే ఆమె కళ్ళు తడిచిపోయాయ్.

"రాజూ... నా జీవితాశయం ఏంటో నీకు చెప్పేను... పసుపుకుంకుమలతో సుమంగళిగా పోవాలని"

అవునన్నట్లు తలూపేను.

"మరి నాకా అవకాశాన్ని కలిగిస్తావా?" దీనంగా అడిగింది. నాకు భూమీ ఆకాశం కలిసి గిర్రున తిరుగుతున్నట్లనిపించింది. షాక్ తినికాదు. ఎగ్జైట్‌మెంట్‌తో. కోరుకున్న మనిషి... కోరుకున్న మనసు... ఆమె మెళ్ళో తాళికట్టి... ఆమె నుదుట కుంకుమలా నిలిచిపోతే! ఈ బంధం జన్మజన్మలకూ మిగిలిపోతే!? ఆలోచనలు... అణువణువూ అవ్యక్తమైన అనుభూతిని పంచుకుంటున్నై.

"చాలా షాక్ తిన్నావ్‌కదూ. నువ్వే కాదు... ఏ మగాడైనా షాక్ తింటాడు. పెళ్ళంటే నూరేళ్ళపంట అంటారు. మూడు మాసాల తంటా అనరు కదా. ఓకే. ఓ.కే. వూరికే ఆశచావక అడిగేశాను. నువ్వు నో అంటావని తెలుసు. ఇలా ఫోర్స్ చేయడం న్యాయంకాదనీ తెలుసు?" అంది తడిచిన కళ్ళను సున్నితంగా వొత్తుకుంటూ.

"చంద్రా! ఇది కలా... నిజమా? అని ఎగ్జయిటవుతున్నానుగాని మరోటికాదు. ఇదిగో... ఆత్మసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను. హేపీగా... తృప్తిగా... గర్వంగా... ఒప్పుకుంటున్నాను" అని చేతిలో చెయ్యి వేశాను.

చంద్ర క్షణం మౌనంగా వుండిపోయింది. ఉక్కిరిబిక్కిరైపోయింది. నోటమాట రాకుండా ప్రతిమలా అయిపోయింది.

"ఓ.కె రాజూ. నువ్వు బాగా ఆలోచించుకొనే ఈ నిర్ణయానికొచ్చావా? నీలో మార్పొస్తే మూడురోజులు కూడా బతకను... ఆc!" అంది ఆవేశంగా వూగిపోతూ.

"ప్లీజ్... నన్ననుమానించకండి"

"మరి నీ భవిష్యత్తు?" వేదనగా అడిగింది.

"మీరే నా భవిష్యత్తు. మీ జ్ఞాపకాలే నా భవిష్యత్తు!"

"ఇవ్వి నీకు బతుకునిస్తాయా?" ఆందోళనపడింది.

"నన్ను బతికిస్తాయి. చాలు... ఈ జన్మకీ తృప్తిచాలు" మరింకేం మాట్లాడొద్దన్నట్లుగా రెండు చేతులూ జోడించేశాను.

క్షణాలు దొర్లిపోతున్నాయి.

అందరి ముఖాలూ గంభీరంగా మారిపోయాయి.

"వెల్... బహుశా ఇదేనేమో జీవితమంటే... నన్ను ప్రాణంగా ప్రేమిస్తున్నానన్నావ్. నాకోసమే బతుకుతున్నానన్నావ్. నేన్లేకపోతే ఈ ప్రపంచమే లేదన్నావ్. నాకు మృత్యువు చేరువయ్యిందని తెలిసి భయపడి దూరంగా పారిపోతున్నావ్- దీనికి నువ్వు పెట్టిన అందమైన పేరు ప్రేమ. నీతో సినిమాలకి రావాలి. షికార్లకు రావాలి. నువ్వు చెప్పింది వినాలి. నీకు తెలీకుండా ఊపిరి కూడా పీల్చకూడదు... కదు రవీ!" అంది అతగాడ్ని చూస్తూ.

నేను షాక్ తిన్నాను. రవి ఇతనేనా? ఏమిటీ మలుపు? ఎందుకిలా చంద్ర ప్రవర్తిస్తోంది? "మరి బ్రదర్‌లాంటివాడని చెప్పిందేవిటి?" ఆలోచిస్తుండగానే తనే కదిలించింది. "అయినవాడు. కాని మగాడు. మనసు కోరుకొని మనువుతో ముడిపెట్టుకోని మగాడు అన్నయ్యతో సమానం... కదూ రవీ!" మళ్ళీ అడిగింది.

"చంద్రా... నన్ను కావాలనే ఇంత అవమానం చేశావ్. ఎవరో... ఆఫ్ట్రాల్ ఒ గ్గొట్టాంగాడిముందు..."

"షటప్. మర్యాదగా మాట్లాడు. అసలు నువ్వేంటి? నీ బతుకేంటి? నీకేగాని నా అండ లేకపోతే ఇలా వుండేవాడివా? ఏరోజో కాలగర్భంలో కలిసిపోయేవాడివి. నీ మాయమాటలతో నన్ను నమ్మించావ్. పిచ్చిదాన్ని చేశావ్. నీతో తిప్పుకున్నావ్. నాపేరుమీద నీ ముద్ర నువ్వే వేసుకున్నావ్. ఓ.కె. ఓ.కే. ఒప్పుకుంటాను. ఇంత చేసిన వాడివి... నాకు చావు మూడు మాసాల్లో వుందంటే స్పృహతప్పి పడిపోయావ్. నేను కోరుకున్న ఆఖరి కోరిక... సుమంగళిగా వెళ్ళిపోయే భాగ్యం ప్రసాదించమని. నేను పోయాక నువ్వు నిశ్చింతగా పెళ్ళి చేసుకోవచ్చని కూడా చెప్పేను. అయినా... నీ మనసు కరగలేదు. నువ్వు కంటికి రెప్పలాగా చూసుకుంటానంటే నమ్మాలి. నన్ను నీ గుండెలమీద పసిపాపలా లాలిస్తానన్నమాట నమ్మాలి. కంఠంలో ప్రాణమున్నంతకాలం మరిచిపోననే మాటని నమ్మాలి కదూ? రవీ! ఎంత తీయని మోసం? ఏం. ఈ మాటలు మింగుడు పడటంలేదూ. ఇంకా నీకు మింగుడుపడని నిజమొకటుంది విను... నేను... నేను కేన్సరు రోగిని కాను. మూడు మాసాల్లో చావను. అయామ్ పెర్‌ఫెక్ట్‌లీ ఆల్రైట్. నేను ప్రేమించే మనిషి కావాలా? నన్ను ప్రేమించే మనిషి కావాలా? అన్న మనసు పడిన మూగవేదనకి ఇది చిన్న ప్రయత్నం. చిన్న పరీక్ష. ఆ పరీక్షలో ఇంతకాలం హీరోగా వున్న నువ్వో బిగ్ జీరో. నేనంటే పిచ్చి వ్యామోహంతో... కావాలని మృత్యువుని కౌగలించుకోడానికి సిద్ధపడి నేను లేకపోతే ఈ బతుకే అంధకారం అనుకొనే రాజు...మగాడు... నేను కోరుకున్న మగాడు. నన్ను సిన్సియర్‌గా కోరుకున్న మగాడు. అందుకే అయ్ లవ్ హిమ్. అయ్ మేరీ హిమ్! నౌ యుకెన్ గో!" అంది గర్వంగా.

రవి నిప్పులు తొక్కుతున్నట్టు ఫీలయ్యి... కారు స్టార్ట్‌చేసి వెళ్ళిపోయాడు దారీతెన్నూ లేకుండా. అర్థరహితమైన నా జీవితానికి సార్థకత ఏర్పడింది. నా జీవన గమనంలో ఓ అందమైన ఇంద్రధనుస్సు ఎదురైంది.

నా జీవితంలో 'చంద్రోదయం' అయ్యింది సజీవంగా. ●

## ఏనుగుతోక లాగితే ఏమవుతుంది?

రొటీన్‌లైఫ్‌లో వుండే అనేకరకాలైన వత్తిళ్ళనుంచి ఓ మూడుగంటలపాటు తప్పించుకొని, రిలాక్స్ అవడంకోసం మాత్రమే చాలామంది సినిమాలు చూస్తారు. ఏ టెన్షన్లూ లేనివారు సరదాకోసం, టైమ్‌పాస్‌కోసం సినిమాలకెళ్తారు. బాధ్యతలూ, బంధనాల్ని ఇంకా సీరియస్‌గా తీసుకోని యువతరం విషయానికొస్తే- విడుదలైన సినిమాలన్నీ 'చూడాలి' కాబట్టి చూస్తారు. ఎవరు ఏ వుద్దేశంతో చూసినా, ఇండైరెక్టుగా సినిమా ద్వారా వీరంతా ఆశించే ప్రయోజనం 'వినోదం' లేదా 'ఎంటర్‌టైన్‌మెంట్'. 'కాదు... సినిమాల్లో వుండే నీతుల్ని నేర్చుకుని బాగుపడ్డానికే మేం వాటిని చూస్తున్నాం' అని కూడా అరుదుగా కొందరంటూ వుంటారనుకోండి. అది కేవలం వారి భ్రమ.

> జంతువులతో, పక్షులతో నిజజీవితంలో అవి చేయని, చేయలేని అడ్డమైన 'ఫీట్ల' గురించి ఆలోచించి ఆలోచించి పిచ్చెక్కిపోయే పరిస్థితుల నుంచి కూడా రైటర్లు తప్పించుకోవచ్చు.

సరే ఇక అసలు విషయానికి వద్దాం. ఇటీవల 'రాజా కో రాణీసే ప్యార్ హోగయా' అనే హిందీచిత్రంలో మనీషా కొయిరాలా ఓ సీన్లో ఏనుగు తోక లాగింది. అదే ఇప్పుడొక పెద్ద సమస్య అయి కూర్చుంది. ఇన్నేళ్ళుగా వినోదమే ప్రధాన ప్రయోజనంగా విలసిల్లుతున్న మన చలనచిత్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఓ కొత్త కలకలాన్ని లేపింది. వన్యప్రాణి సంరక్షణకు కంకణం కట్టుకున్న కేంద్రమంత్రి మేనకాగాంధీ దృష్టిలో 'ఏనుగుతోక లాగడం' అనేది ఓ పెద్ద నేరం, ఘోరం అయిపోయింది. ఫలితంగా ఆ సినిమా ప్రొడ్యూసరూ, మనీషా కొయిరాలా లీగల్ నోటీసులను అందుకున్నారు. పనిలో పనిగా- ఈ సందర్భంగానే సదరు కేంద్ర 'సామాజిక న్యాయం, అభ్యున్నతి' శాఖ మంత్రి సినిమాల్లో జంతువుల, పక్షుల చిత్రీకరణకు సంబంధించి కొన్ని రూల్స్‌ను కూడా జారీచేశారు. అసలే 'స్లంప్'తో చతికిలపడిపోయిన సినిమావాళ్ళకు ఈ కొత్త రూల్స్ చూడగానే పిచ్చెక్కింది! మేనకా గాంధీ సూచించిన నిబంధనల్లో 'ఏ జంతువునీ వినోదంకోసం వాడుకోకూడదు... పాములను ఏవిధంగానూ చూపకూడదు' అనే రెండు నిబంధనలు చాలు- కీర్తిశేషులైన చిన్నప్పదేవర్‌లాంటి నిర్మాతలు మళ్ళీమళ్ళీ గుండాగి చనిపోడానికి!

ఒకటిమాత్రం నిజం. ఈ నిబంధనల్ని తు.చ.తప్పకుండా ఫాలో కావల్సిన పరిస్థితే గనుక ఇండస్ట్రీలో వస్తే ఎక్కువగా సంతోషించేది మేనకాగాంధీ కాదు... సినీ రచయితలు! అవును మరి... యమ సీరియస్‌గా కథ చెప్పుకుంటూ పోతున్న రైటర్‌ను ఓ సీన్ దగ్గర ఠక్కున ఆపి 'ఇక్కడ పామును పెట్టు... అక్కడ కుక్కను పెట్టు' అంటూ నిర్మాతలు చంపుకుతినటం వుండదు. దర్శకులు ఇంప్రెస్ అయ్యేలా రాయడంకోసం జంతువులతో, పక్షులతో నిజజీవితంలో అవి చేయని, చేయలేని అడ్డమైన 'ఫీట్ల' గురించి ఆలోచించి ఆలోచించి పిచ్చెక్కిపోయే పరిస్థితుల నుంచి కూడా రైటర్లు తప్పించుకోవచ్చు.

అలాగే- నాణేనికి మరోవైపు కూడా చూద్దాం. 'పాము సెంటిమెంటు లేకుండా అసలు సినిమా ఏంటి?'... 'మన సినిమాలో మేజర్ రోల్ కుక్కదే...' తరహాలో ఆలోచించే నిర్మాతలు ఇండస్ట్రీని వదిలేసి కాషాయం స్వీకరించాల్సి వుంటుందేమో! మన సినిమాల్లో పాము పడగవిప్పినా, కుక్క తోకాడించినా, ఏనుగు తొండం లేపినా, పావురం రెక్కవేసినా విజిల్స్‌వేసి చప్పట్లు కొట్టే ప్రేక్షకులు ఇకమీదట హాల్లో గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోక తప్పదు. ఇవే సీన్లలో- ఆయా జంతువుల. పక్షుల నటనను చూసి కుళాయి తిప్పినట్టు జలజలా కన్నీళ్ళు కార్చే మహిళా ప్రేక్షకలోకానికి కూడా ఇదొక పెద్దలోటే కావచ్చు. కాని అలాజరగదు. అదీ...నాగిన్, హాథీ మేరే సాథీ, మైనేప్యార్‌కియా, నోము, పొట్టేలు పున్నమ్మ, దేవి వంటి వందలాది బాక్సాఫీస్ హిట్లు రూపొందించిన మనదేశంలో!

**- మనూ**

